సంస్కారంలేని
ఆమెకి
పనిమనిషి
చెప్పిన గుణపాఠం?

# ఔన్నత్యం




దేవగన్నేరు, మందార పూలతో శోభాయమానంగా అలంకరించిన వెండి దేవతా విగ్రహాలు, ఆ విగ్రహాలకి ఇరువైపులా జానెడు ఎత్తున్న వెండి కుందులు, ఆ కుందుల్లో దేదీప్యమానంగా వెలుగుతున్న జ్యోతులు, వాటికి కొంచెం ముందుగా పరిమళ ధూపాన్ని వ్యాపింపచేస్తున్న అగరుబత్తులు, అవి వుంచిన జిలుగులు, వగిషే లు గల వెండి స్టాండులతో ఆ పూజా మందిరం కళకళలాడుతూ ఆ గృహస్థు ఆర్థిక స్థితికి అద్దంపడ్తోంది.

పూజా మందిరం ముందు కూర్చున్న సరళ 'ఓం త్రి కాలజ్ఞాన సంపన్నాయునమః ఓం భువనేశ్వర్యైనమః ' అంటూ లక్ష్మీ సహస్ర, అష్టోత్తర శతనామావళులను ఉచ్ఛరిస్తూ పూజించటము ముగించింది.

'సరళా నీతోనే మాట్లాడాలని పనిమనిషి లక్ష్మివచ్చి అరుగుమీద కూర్చుందని నీవు పూజమొదలు పెట్టక మునుపే చెప్పాను. ఇంకా ఎంతసేపు కూర్చుంటుంది ముందు దాని విషయం చూచి పంపించు. తరువాత నైవేద్యం హారతులు లాంటి తతంగం తీరుబడిగా చేసుకోవచ్చు' అన్నాడు భర్త రామ్మూర్తి కొంచెం అసహనం విసుగు మేళవించిన స్వరంతో.

"నోరూ వాయులేని దేవతా విగ్రహాలకి షోడసోపచారాలు చేసి అందలం ఎక్కించటం, మనల్ని నమ్ముకు బ్రతికే వాళ్ళని, పేదవాళ్ళని హీనంగా చూడటం, నీక్కాగా వెల్లుబాటైంది" అనే భావం భర్త ముఖంలో ప్రస్ఫుటంగా సరళకు కనిపించింది.



భర్త తన అతి మంచితనం, విశాల భావాలు తనకీ కూడా అంటుగట్టాలని పడే తాపత్రయం సరళకు అలవాటే. అది ఎప్పట్నుంచో కూర్చుందని మీరు ఎందుకు అంత విలవిలలాడ్తారు. అదేమన్నా విఐపినా పనిమనిషే కదా! కూర్చుంటుంది లెండి'' అంది తన సహజ ధోరణిలో. రామ్మూర్తి ఒక నిట్టూర్పు విడిచి అక్కడినుంచి కదిలాడు.

భార్యలో తాను ఆశించే మార్పు సుదూరమా! అనే అనుమానం ఆ నిట్టూర్పులో చోటుచేసుకుంది.

నైవేద్యం, హారతి, మంత్రపుష్పం వగైరాలన్నీ ఇంకో అరగంట సమయాన్ని తిన్నాయి. ప్రసాదం తను తిని, భర్తకి ప్లేటుతో ఇచ్చి లక్ష్మి దగ్గరికి వెళ్తున్న సరళని పిల్చి చూడూ ఆ ప్రసాదం లక్ష్మికి కూడ పెట్టరాదూ ఆకలి తీరని బ్రతుకులు గనక నీవు ఎంతపెట్టినా తిని, మహదానందంగా తృప్తి పడ్తుంది' అన్నాడు రామ్మూర్తి.

మీరు చెప్పినట్లు పందారాలు చేస్తే అయినట్లే. ఆరు నెలల కాపురం మూడు నెలలకి వస్తుంది. నీ ఫ్రెండ్సుకైతే స్వీటు భరిణల్లో పెట్టి ఇళ్ళకు పంపిస్తావు' అని మీరు అడగవొచ్చు. ఆ భరిణలు తిరిగి ఇచ్చేపుడు వాళ్ళు ఖాళీగా ఇవ్వరు. ఏవో ఒక తినుబండారాలు నింపిఇస్తారు. ఊరికే అందరికీ పందారాలు చేసేంత తెలివి తక్కువదాన్ని కాదు'' అంటూ వెళ్ళి వీధి తలుపు తీసింది సరళ.

భార్య మనస్తత్వం తెల్సినా, తను చెప్పదల్చుకున్నది చెప్తూ వుంటే, వినగా వినగా ఆమెలో మార్పురావచ్చు అనే నమ్మకంతో, రామ్మూర్తి విసుగు లేకుండా భార్యకి హితోపదేశాలు చేస్తూనే వుంటాడు.

అమ్మగారూ మా ఇళ్ళ కాడోళ్ళందరూ మూటలాళ్ళ దగ్గర మంచి చీరలు కొనుక్కున్నారు. ఆ చీరలు బాగున్నాయి. తమరు ఒప్పుకున్న చీర ఈ నెలలో కొనిస్తానన్నారు కదా అని, మిమ్మల్ని అడిగి ఆ చీరలవాడ్ని ఇక్కడికి తీసుకువద్దామని, 'కూచుండాను' అంది లక్ష్మి వినయంగా.

సరళ మీమాంసలో పడింది. తను 50 రూపాయల్లో చీరకొనిద్దాము అని అనుకుంది. అంతకన్నా ఖరీదు ఎక్కువైతే ఎలా ఈ ఆలోచనతో మౌనం వహించింది.

'తమరు కొనిపెడ్తానన్న ఖరీదేనమ్మా ఆ చీరలు. మరల లక్ష్మి అంది సరళ మనోభిప్రాయం గ్రహించినట్లు. సరే తీసుకురా అంది సరళ ముభావంగా.

సరళా గుడ్ న్యూస్ మీ అన్నయ్య ఇంటి గృహప్రవేశంట. మనల్ని వెంటనే బయల్దేరమని టెలిగ్రాము ఇచ్చాడు. ఆఫీసు నుంచి వస్తూనే చెప్పాడు రామ్మూర్తి.

ముందుగా తెలియజెయ్యక్కర్లా ఇదేనా మర్యాద అని రుసరుసలాడింది సరళ. వ్యవధి లేక పోబట్టే కదా! టెలిగ్రాం ఇచ్చింది. దానికి రుసురుస లెందుకు. ప్రయాణానికి కావల్సినవి సర్దు. రాత్రి బస్సులో బయల్దేరదాం అన్నాడు రామ్మూర్తి.

అన్నగారు పెట్టబోయే చీర, గృహప్రవేశ సందర్భంలో ఆడబడుచుకు లభించే లాంఛనాలు, పెద్దఎత్తులో ఊహించుకుని కొంచెం శాంతపడింది సరళ.

లక్ష్మికి చీర కొన్నావా! అని అడిగాడు రామ్మూర్తి సూట్ కేసులో బట్టలు సర్దుతున్న భార్యతో...

కొన్నానండీ, మధ్యాహ్నమే చీరల వాణ్ణి తీసుకువచ్చింది.

చీర ఖరీదు 50 రూ. లేనండి. చాలా బావుందని లక్ష్మి మురిసిపోయింది. దానికి ఎంత వచ్చిందో ఆ చీర. పుట్టినరోజుకి

కట్టుకుంటుందిట అని భర్తకి చెప్పింది సరళ.

గృహప్రవేశం అయిన రాత్రే తిరిగి బయల్దేరి వచ్చేసారు రామ్మూర్తి, సరళ. అన్నగారు ఇచ్చిన చీర సరళకి ఏ మాత్రం నచ్చలా. మన పనిమనిషి కట్టుకునే చీరలా వుంది. దానికి ముందుగా కొని ఇవ్వకపోయినా బావుండేది. ఈ చీర దానికి ఇచ్చేదాన్ని... బీరువాలో బట్టలు సర్దుతూ విచారంగా అంది సరళ.


పుట్టింటి వారు ఆప్యాయతతో ఏం పెట్టినా సంతోషంగా తీసుకోవాలి సరళా. మా అన్నయ్య అప్పుచేసి ఇల్లు కట్టుకున్నాడు. ఇంకా ఆయనకు చాలా బాధ్యతలు వున్నాయి. ఆ పరిస్థితులలో ఇంతకన్నా ఖరీదైనది ఎలా కొనగలడు చెప్పు' అని అనునయంగా భార్యకి నచ్చచెప్పాడు రామ్మూర్తి.

మీరు నన్ను తప్పించి అందర్నీ సపోర్టు చేస్తారు' అంటూ మూతివిరిచింది సరళ. ఇంత డబ్బు ఖర్చుచేసుకుని వెళ్తే, ఏమీ గిట్టుబాటు అవలేదనే తపనతో ఆమె అసహనాన్కి గురి అయింది.

మనసు బావుండడం లేదు చిరాగ్గా వుంది. సినిమా కన్నా వెళ్దాం పదండి అని భర్తని బయల్దేర తీసింది సరళ. మన పని మనిషి లక్ష్మి కదూ ఆ చెట్టు క్రింద కూర్చుంది' అన్నాడు రామ్మూర్తి రిక్షాలోంచి చూస్తూ. అవును అదే. ఇక్కడ వుందేమిటి ? అనుకుని ఏయ్ రిక్షా ఆపు అని ఇద్దరూ లక్ష్మి దగ్గరకు వెళ్ళారు.

ఇక్కడ కూర్చున్నావేమిటే? అని ఆశ్చర్యంగా ప్రశ్నించింది సరళ. అమ్మగార్ని, అయ్యగార్ని చూసేసరికి తత్తరపడి లేచి నిలబడింది లక్ష్మి. అప్పుడే గుడ్డి అతనికి ఆసరా ఇస్తూ పదేళ్ళ కుర్రవాడు అక్కడికి వచ్చాడు. అలవాటు అయిన చోటులా గుడ్డివాడు చెట్టుక్రింద కూలబడ్డాడు. లక్ష్మిని వాళ్ళు ప్రశ్నించటము ఆమె తత్తరపడటం ఆ కుర్రాడు విన్నాడు.

దండాలు అయ్యగారు, ఈ అమ్మ



## అభ్యంతరం

గిరి వారిని సందిగ్ధంగా అడిగాడు.
"గీతాకుమారిని నేను ప్రేమిస్తే మీకేమైనా అభ్యంతరమా?"

"సుబ్బారావుకి అభ్యంతరం కావచ్చు"
"ఆయనెవరు?"
"గీతాకుమారి భర్త..."
"ఆ...!?"

—ఎ.ఉష్యం (సికింద్రాబాద్)

మామీద జాలితో పట్టెడు అన్నం గిన్నెడు గంజి రోజూ పోస్తది బాబూ అన్నాడు లక్ష్మిని చూపిస్తూ. లక్ష్మి ప్రక్కనే వున్న తెల్ల టిఫెన్ అప్పుడే చూశారు రామ్మూర్తి, సరళ. పదిళ్ళలో పన్లు చేసుకుని బ్రతికే నీకు తోడు దానధర్మాలు కూడానా అని అమ్మగారు అరుస్తారేమో అనే భయం, బిడియంతో లక్ష్మి కుంచించుకుపోయింది.

సరే... సినిమా టైమ్ అవుతోంది పదండి అని రిక్షావేపు నడిచింది సరళ. ఎవరో తరుముతున్నట్లు. వాళ్ళ ముందరే ఏం క్లాసులు తీసుకుంటారో అనే భయంతో మారు మాట్లాడనీకుండా తొందరపెట్టింది భర్తని.

ప్రతిఫలాపేక్ష లేకుండా ఉపకారం, దానం లాంటి మంచి పన్లుచేస్తే భగవంతుడు అంతకు రెట్టింపు మేలు మనకు చేస్తాడు. దానం చెయ్యటానికి డబ్బు వుండటం లేకపోవడం అనే ప్రశ్నలేదు. దానం చెయ్యాలి అనే బుద్ధి మటుకు వుండాలి. అది వుంటే లక్ష్మిలా ఎవరికి వున్నంతలో వాళ్ళు ఇతరులకు సహాయపడవచ్చు. కేవలం పూజలు, పునస్కారాలవల్ల ఫలితం మృగ్యం' అని భార్యని క్రీగంట చూస్తూ రామ్మూర్తి చిన్నక్లాసు తీసుకున్నాడు సినిమా వెయ్యటానికి వున్న వ్యవధిలో.

ఎప్పటిలా సరళనుంచి వ్యతిరేక సమాధానాలు రాకపోవడం చెప్తున్నవి శ్రద్ధగా ఆలకించటంతో ఇవి మంచి మార్పుకి నాందేమో అని రామ్మూర్తి సంతోషించాడు.

ఏమిటి అక్కా సర్‌ప్రైజ్ విజిట్ సరళా మా అక్కవచ్చింది అని సంతోషంగా కేకవేసాడు ఒకరోజు ఉదయాన్నే రామ్మూర్తి ... సరళ భర్త గొంతువిని గతుక్కుమంది. ఇదో ఖర్చు అని మనస్సులోనే సణుక్కుంది. మునుపటి నైజం ఇంకా పూర్తిగా ఆమెలో తొలగిపోలా.

పొలం విషయాలు మాట్లాడటానికి మా పల్లెటూరు వెళ్ళాల్సి వచ్చింది. దోవేకదా అని మిమ్మల్ని చూడాలని దిగాను అంది 'ఆవిడ'. అవును అక్కా నిన్ను చూచి దగ్గర దగ్గర రెండు సంవత్సరాలైంది. ఎప్పుడు రమ్మనమని రాసినా రావు అన్నాడు రామ్మూర్తి ఆప్యాయత నిండిన స్వరంతో, తమ్ముడి ఆప్యాయతకి చలించిపోతూ. 'రావాలని వున్నా పిల్లలు పెద్దవాళ్ళు అయ్యాక కుదరదురా' ఏవో ఇబ్బందులు, అడ్డంకులు తెల్లవారుజాము బస్సుకి నన్ను ఎక్కించు మిమ్మల్ని చూడాలని అనుకున్నాను చూచాను. వుండటానికి అసలు వీలవదు. మీ బావగారు ఎదురుచూస్తూ వుంటారు' అంది ఆవిడ.

అక్క వచ్చిందని ఆఫీసుకి శెలవు పెట్టాడు రామ్మూర్తి. భోజనాలు అయిన తర్వాత సరళని బెడ్ రూమ్‌లోకి పిలిచి అక్కకి చీర కొనుక్కొందాం పద అన్నాడు. "ఎందుకండీ మళ్ళీ చీర కొనటం, మా అన్నయ్య పెట్టిన చీర వుంది కదా అది ఇస్తాను అంది సరళ ముఖం గందుగా పెట్టుకుని. ఎటూ భర్త ఇష్టపడడు అని ఆమెకీ తెల్సు.

నీకు ఆ చీర మీ అన్నయ్య పెట్టినందుకు సణిగావు కదా! మళ్ళీ ఆ చీరే ఎందుకు మా అక్కకి మంచి చీర కొందాం అన్నాడు రామ్మూర్తి. అవును లెండి నాకొక రూలు మీ అక్కకి ఒక రూలు. పుట్టింటి వారు పెట్టింది సంతోషంగా తీసుకోవాలని నాకు

చెప్పారు. మీ అక్కకి అది వర్తించదు లెండి' అంది సరళ వాదనకి దిగుతూ.

మా అన్నగారు ఇల్లు కట్టుకుని ఖర్చులో వున్నాడు. ఇంకా ఆయనకు చాలా బాధ్యతలు వున్నాయి. కనుక ఆయన్నుండి అధికంగా ఆశించటం తగదు అన్నాను. దానికి మా అక్కకి చీర పెట్టటానికి ముడి పెడ్తావేమిటి? ఇన్ని సంవత్సరాల తర్వాత నా అక్క మన ఇంటికి వస్తే ఆర్థికస్తోమత వున్న నేను నీకు నచ్చని చీర మా అక్కకి ఇవ్వాల్సిన అవసరం ఏమిటి? నేను ఏది ఇచ్చినా మా అక్క సంతోషంగా తీసుకుంటుంది. నీలా అత్యాసపడదు.

'అయినా నేను ఇంకో చీర కొంటాను' బయల్దేరు బజారుకి అన్నాడు రామ్మూర్తి కొంచెం కటువుగా.


ఒదినగారు ఇంట్లో వున్నప్పుడు ఘర్షణ పడడం, బావుండదని మౌనంగా వుండిపోయింది. ఎటూ భర్త చెయ్యదల్చుకున్నది చేస్తాడని తెల్సుగనుకే సరళ సంభాషణని పొడిగించలా.

ఇంతలో పని మనిషి లక్ష్మి వచ్చింది అంట్లు వెయ్యండమ్మా అంటూ... అదేం టే లక్ష్మి. ఈరోజు నీ పుట్టిన రోజు కదా! క్రొత్త చీర కట్టుకోలేదే' అని ఆశ్చర్యంగా అడిగింది సరళ.

అమ్మగారు... మా ఒదిన ఏదో పనిబడి వచ్చిందండి. ఆడ కూతుర్ని ఉత్తచేతుల్తో పంపించటానికి మనసొప్పలేదు అమ్మగారు. మీరు కొనిచ్చిన చీర మా ఒదినకి బొట్టుపెట్టి ఇచ్చినాను— అంది చాలా సంతోషంగా. తన ధర్మం తాను నిర్వర్తించాను అనే తృప్తి లక్ష్మి స్వరంలో వుంది.

సరళ ముఖంలో నెత్తురు చుక్కలేదు. తెల్లగా పాలిపోయింది. తన అల్పబుద్ధికి సిగ్గుపడ్తూ, లక్ష్మి ఔన్నత్యానికి మనసులోనే జోహార్లు అర్పించింది.

## అరటిపళ్లు ఔషధ గుణం



కడుపులో ఏర్పడే అల్సర్స్ (పుండ్లు) నివారించేందుకు ఆకుపచ్చ రంగులో ఉండే అరటిపండ్లు చక్కగా పని చేస్తాయని బ్రిటిష్ శాస్త్రవేత్తలు కనుక్కొన్నారు. సరిగ్గా పండని ఆకుపచ్చని అరటిపండ్లు, జీర్ణాశయపు గోడలకుండే మ్యూకస్ పొరను వృద్ధి చేస్తాయని యాస్టన్ యూనివర్శిటీ ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందిన డాక్టర్ బాయి సశాస్త్రీయంగా నిరూపించాడు.

ప్రసూం